
ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 39.0
కనిష్ఠం 25.8

ANDHRAJYOTHY



యాదాద్రి భువనగిరి

5

బుధవారం 19 జూన్ 2024

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	504.50 (122.5225)	నిల్	800
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	637.45 (2.66)	78.39	78.39
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	96.17 (0.56)	నిల్	1621

ప్రాజెక్టుల నీటిమట్టం

చికెన్ ధరలు | లైవ్ :రూ.168 | డ్రెస్ :రూ.260 | స్కిన్‌లెస్ : రూ.290



ప్రధాన ద్వారం ఎదుట భక్తుల రద్దీ

గుండెల నిండా నృసింహ స్మరణ

» తొలిరోజు 'గిరి' ప్రదక్షిణలో 10,000 మంది » ప్రదక్షిణను ప్రారంభించిన విప్ అయిలయ్య

గుండెల నిండా లక్ష్మీనృసింహుడి నామస్మరణతో 'గిరి' ప్రదక్షిణ ఆధ్యాత్మిక వాతావరణం నడుమ కొనసాగింది. స్వామివారి దేవస్థానంలో అనవాయితీగా వస్తున్న గిరిప్రదక్షిణలో మంగళవారం అంచనాలకు మించి భక్తులు పాల్గొని ఏకశిఖరవాసుడిపై భక్తిని చాటుకున్నారు. కార్యక్రమాన్ని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ప్రారంభించారు. తొలిరోజు 'గిరి' ప్రదక్షిణలో 10వేల మంది భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులతో వైకుంఠ ప్రాంతమంతా జన సంద్రంగా మారింది. ఉదయం 5.30గంటలకు వైకుంఠ ద్వారం నుంచి మొదలైన ప్రదక్షిణ కొండ చుట్టూ సుమారు రెండు కిలోమీటర్ల మేర కొనసాగింది.

- భువనగిరి అర్బన్

7



గిరి ప్రదక్షిణలో పాల్గొన్న విప్ అయిలయ్య, ఆర్డీ భాస్కర్‌రావు

'గిరి' ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు



22న డీసీఎంఎస్ చైర్మన్ ఎన్నిక

» షెడ్యూల్ విడుదల చేసిన జిల్లా సహకార అధికారి » ఏకగ్రీవం అయ్యే అవకాశాలు?

నల్లగొండ,జూన్ 18:నాగార్జున జిల్లా సహకార మార్కెటింగ్ సంఘం చైర్మన్ ఎన్నికకు జిల్లా సహకార అధికారి, డిప్యూటీ కోఆపరేటివ్ రిజిస్ట్రార్, ఎన్నికల అధికారి జి.శ్రీనివాస్ మంగళవారం షెడ్యూల్ విడుదలచేశారు. చైర్మన్ ఎన్నికకు ఈ నెల 22వ తేదీన పోలింగ్ నిర్వహించనున్నారు. 2020 ఫిబ్రవరిలో డీసీఎంఎస్‌కు ఎన్నికలు నిర్వహించారు. మొత్తం 10మంది డైరెక్టర్లు ఉన్న డీసీఎంఎస్‌కు సూర్యాపేటకు చెందిన వట్టె జానయ్యను చైర్మన్‌గా, దుర్గంపూడి నారాయణరెడ్డిని వైస్ చైర్మన్‌గా ఎన్నుకున్నా రు. అయితే 2023లో చైర్మన్ జానయ్య ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రాథమిక సంఘం జనరల్ బాడీ సమావేశాలను సక్రమంగా నిర్వహించడం లేదన్న కారణంతో ఆ పాలకవర్గాన్ని పూర్తిగా రద్దుచేశారు. దీంతో ఆయన డీసీఎంఎస్ చైర్మన్ పదవిని కోల్పోయా రు. వైస్ చైర్మన్‌గా కొనసాగుతున్న దుర్గంపూడి నారాయణరెడ్డిని చైర్మన్‌గా నియమించారు. సహకార చట్టం ప్రకారం ఆరునెలల్లో చైర్మన్ ఎన్నిక నిర్వహించాల్సి ఉంటుంది. దీంతో ఇటీవల జరిగిన పాలకవర్గ సమావేశంలో ఎన్నిక నిర్వహించాలని తీర్మానం చేశారు. ఈనేపథ్యంలో ఎన్నికల షెడ్యూల్ విడుదలయింది. ఈ నెల 22న ఉదయం 9 గంటల నుంచి 11గంటల వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. 11గంటల నుంచి 11.30 గంటల వరకు నామినేషన్ల పత్రాల పరిశీలన, 12గంటల నుంచి 2గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణ కార్యక్రమం ఉంటుంది. ఎవరైనా పోటీలో ఉంటే మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారు. బ్యాలెట్ పద్ధతిన ఈ ఎన్నిక జరగనుంది. అయితే చైర్మన్ ఎన్నిక ఏకగ్రీవమయ్యే అవకాశాలు ఉన్నాయి.


జిల్లాకేంద్రంలో తాగునీటి సమస్య శాశ్వతంగా పరిష్కారం కానుంది. ఇందుకోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక నిధులు కేటాయించాయి. 2038 నాటికి భువనగిరి పట్టణ జనాభా లక్ష దాటనున్న నేపథ్యంలో ముందస్తుగా ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయి. ఇప్పటికే టెండర్ ప్రక్రియ పూర్తి కాగా.. త్వరలో పనులు ప్రారంభించనున్నారు.

● భువనగిరి టౌన్



భువనగిరి పట్టణ వ్యూ

తాగునీటి సమస్య పరిష్కారానికి అమృత్ 2.0



అమృత్ 2.0 పథకం కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.21.80 కోట్లు కేటాయించాయి. భువనగిరి పట్టణంలో ప్రస్తుతం తాగు నీటి సమస్య నామ మాత్రంగానే ఉండగా, మరో 14 ఏళ్లపాటు పెరిగే జనాభాను దృష్టిలో ఉంచుకొని అమృత్ 2.0 పథకం ద్వారా నిధులు కేటాయించారు. రూ.21.80కోట్లతో ప్రతిపాదించిన ఈ పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయి. పట్టణాల ప్రగతే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం రూపొందించిన అటల్ మిషన్ రెజ్యువేషన్ అండ్ అర్బన్ ట్రాన్స్‌ఫర్మేషన్ (అమృత్) 2.0, రాష్ట్ర ప్రభుత్వ పథకమైన మిషన్ భగీరథ సంయుక్తంగా భువనగిరిలో 2038 నాటికి పెరిగే 1,01,989 జనాభాకు రోజువారీగా 15 ఎంఎల్‌డీ తాగునీటిని సరఫరా చేసేందుకు ప్రతిపాదించిన పనులు త్వరలోనే ప్రారంభంకానున్నాయి. ఇప్పటికే టెండర్లు పూర్తి కాగా చేయాల్సిన పనులను కూడా క్షేత్రస్థాయిలో గుర్తించారు. సుమారు ఏడాదిన్నర క్రితం ప్రారంభమైన డీపీఆర్, సర్వే తదితర పనులు పూర్తయి ఇటీవల టెండర్ దశను దాటింది. ప్రజారోగ్య శాఖ (పబ్లిక్ హెల్త్)పనులను పర్యవేక్షించనుంది. ప్రతిపాదిత పనులు పూర్తయితే హైదరాబాద్‌కు ఆమడ దూరంలో, హెచ్‌ఎండీఏ పరిధిలో ఉండి, త్వరలో నిర్మించనున్న రీజినల్ రింగ్ రోడ్డు లోపల ఉండనున్న భువనగిరి పట్టణ అభివృద్ధి మరింత వేగం పుంజుకునే అవకాశాలున్నాయి.

ప్రాజెక్టు వ్యయం రూ. 21.80 కోట్లు

2038నాటికి భువనగిరి జనాభాను 1,01,989గా అంచనా వేశారు. ఒక్కొక్కరికి రోజుకు 135లీటర్ల నీటిని సరఫరా చేసే లక్ష్యంతో అమృత్ 2.0, మిషన్ భగీరథ సంయుక్తంగా తాగునీటి పథకానికి రూ.21.80కోట్లు అవుతుందని అంచనావేసి టెండర్లు పిలిచారు. కేఎన్‌ఆర్ సంస్థ పనులను దక్కించుకుంది. ఈ మొత్తంలో కేంద్రం రూ.10.125 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం 5.085 కోట్లు, 15వ ఆర్థిక సంఘం రూ.5.04 కోట్లు, భువనగిరి మునిసిపాలిటీ రూ.1.55కోట్లు సమకూర్చనున్నాయి. 18నెలల వ్యవధిలో పనులు పూర్తి చేయాల్సి ఉంది.

మూడు ట్యాంకులు, 31,591 మీటర్ల పైప్‌లైన్ నిర్మాణం

అమృత్ 2.0పథకంలో భాగంగా భువనగిరి పట్టణంలో నూతనంగా మూడు ట్యాంకులను, 31,591 మీటర్ల పైప్‌లైన్‌ను నిర్మించనున్నారు. ప్రగతీ నగర్‌లో 15లక్షల లీటర్లు, సింగన్నగూడెంలో 10 లక్షలలీటర్లు, రాయిగిరిలో 3లక్షల లీటర్ల సామర్థ్యంగల ట్యాంకులను నిర్మించనున్నారు. గృహాలు ఉండి నీటి సరఫరాకోసం పైపు లైనులేని ప్రాంతాల్లో 31,591 మీటర్ల (31 కిలోమీటర్లు)పైప్‌లైన్, ఇదే పైప్‌లైన్ వెంట ఇంటర్నెట్ తదితర కేబుళ్లకోసం 34,171 మీటర్లు (34 కిలోమీటర్లు) పీఎల్‌బీ డక్ట్, 2,580 మీటర్ల (2.5 కిలోమీటర్ల) గ్రావిటీ మెయిన్స్ నిర్మిస్తారు. అలాగే ప్రస్తుతం ఉన్న 20 ట్యాంకులకు, సుమారు 121 కిలోమీటర్ల పైప్‌లైన్‌కు అవసరమైన పెండింగ్, మరమ్మతు పనులను కూడా పూర్తి చేయనున్నారు. కాగా నీటి సరఫరా విభాగ కార్యాలయాలు, సిబ్బంది క్వార్టర్లు, ఇతర పనులు చేపడతారు. 1,870 నూతన నల్లా కనక్షన్లు కూడా ఇవ్వనున్నారు.



ప్రస్తుతం నీటి సరఫరా ఇలా..

ప్రస్తుతం 76.81 చదరపు కిలోమీటర్ల వైశాల్యంతో ఉన్న భువనగిరి పట్టణంలో సుమారు 75,779 జనాభా ఉంది. 14,750 అసిస్‌మెంట్స్ ఉండగా.. సుమారు 16వేల గృహాలు ఉన్నాయి. వీటికి సుమారు 10వేల నల్లా కలెక్షన్లు ఉన్నాయి. ప్రస్తుత జనాభాకు రోజువారీగా నీటి సరఫరాకు సుమారు 10 ఎంఎల్‌డీ నీరు అవసరముండగా హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ (హెచ్ఎండబ్ల్యూఎస్)నుంచి రోజువారీగా కేవలం సుమారు 5.7 ఎంఎల్‌డీ మాత్రమే సరఫరా అవుతుండగా, మిగతా జలాలను స్థానిక పవర్ బోర్లతోపాటు ఇతర మార్గాల్లో సేకరిస్తూ గోదావరి జలాలలను మూడు రోజులకోసారి, స్థానిక జలాలను రోజువిడిచి రోజు మునిసిపాలిటీ సరఫరా చేస్తోంది. రూ.21.80 కోట్లతో చేపడుతున్న పనులు పూర్తయితే హెచ్ఎండబ్ల్యూఎస్‌తోపాటు మిషన్ భగీరథ జలాలు సరఫరా అవుతాయి. దీంతో అందరికీ రోజువారీగా రక్షిత జలాలే సరఫరా అయ్యే అవకాశాలు మెరుగుతాయి. అయితే 2038 నాటికి అంచనా జనాభా 1,01,989కు రోజువారీగా 15 ఎంఎల్‌డీ జలాలు అవసరం పడతాయని అంచనా వేస్తుండగా మల్లన్న సాగర్ నుంచి 8.2 ఎంఎల్‌డీ జలాలు సరఫరా అయ్యేలా అధికారులు ప్రతిపాదించారు.

శాశ్వతంగా తీరనున్న తాగునీటి ఇబ్బందులు



ప్రతిపాదిత అమృత్ 2.0, మిషన్ భగీరథ సంయుక్త పనులు పూర్తయితే భువనగిరి పట్టణంలో 2038 వరకు తాగునీటి సమస్యలు శాశ్వతంగా పరిష్కారమవుతాయి. పబ్లిక్ హెల్త్ శాఖ పర్యవేక్షించనున్న పనులు త్వరలో ప్రారంభంకానున్నాయి. చేపట్టాల్సిన పనుల కోసం ప్రదేశాల గుర్తింపు పూర్తయింది. ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డితోపాటు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. వరుస ఎన్నికల కోడ్‌తో ఆలస్యమైన అమృత్ 2.0 పనులను త్వరలో చేపట్టేందుకు సంబంధిత అధికారులు సన్నాహాలు ప్రారంభించారు.

- పి.రామాంజుల్ రెడ్డి, కమిషనర్, భువనగిరి మునిసిపాలిటీ



అన్ని రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్

ఉమ్మడి జిల్లాలో అన్ని మండలాలకు కేటాయింపులు

త్వరలో క్లస్టర్‌ల వారీగా సెంటర్‌ల ఏర్పాటు నిర్ణయం

నల్లగొండ, జూన్ 18: ఇక నుంచి ప్రతీ మండల రైతు వేదికలో వీడియోకాన్ఫరెన్స్ సెంటర్లు ఏర్పాటు కానున్నాయి. ఇప్పటివరకు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ప్రతీ నియోజకవర్గ కేంద్రంలో మాత్రమే ఆయా రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ కేంద్రాలు ఉండగా, తాజాగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మూడు జిల్లాల్లో ప్రతీ మండలంలోని ఆయా రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. రైతులకు అవగహన కల్పించడంకోసం త్వరలో వ్యవసాయ క్లస్టర్ల వారీగా ప్రతీ మూడు, నాలుగు గ్రామాలకు ఒక వీడియో కాన్ఫరెన్స్ కేంద్రం అందుబాటులోకి రానుంది. రైతు వేదికలను సద్వినియోగం చేసుకోవడంతోపాటు ప్రతీ వారం రైతులకు వివిధ పంటల సాగులో మెళకువలు ఇవ్వడం, శిక్షణ, అవగాహన కల్పిస్తారు. ఇందుకు వ్యవసాయ అధికారులతోపాటు శాస్త్రవేత్తలు బాధ్యతలు తీసుకుని వీడియో కాన్ఫరెన్స్ సెంటర్ల ద్వారా కార్యక్రమాలు చేపడుతారు. రైతు వేదికల్లో ఎల్‌సీడీ, వీడియో కెమెరాలు, సౌండ్ సిస్టం వంటి సౌకర్యాలు కల్పించి వీడియో కాన్ఫరెన్స్ కేంద్రాలుగా మారుస్తారు. గతంలో నియోజవర్గానికి ఒక సెంటర్‌ను ప్రారంభించినప్పుడు సత్ఫలితాలు వచ్చాయి. దీంతో మండలానికో వీడియో కాన్ఫరెన్స్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నారు. గత ప్రభుత్వంతోపాటు ప్రస్తుత ప్రభుత్వం కూడా వ్యవసాయంపై దృష్టిసారించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ పరిశోధన కేంద్రాలతోపాటు తెలంగాణలో ఉన్న వ్యవసాయ పరిశోధన కేంద్రాల్లో వివిధ పంటల సాగుపై రూపొందించిన వీడియోలను కూడా ప్రదర్శించే అవకాశాలుంటాయి. దీనికి తోడు శాస్త్రవేత్తలు వీడియో కాన్ఫరెన్స్ సెంటర్‌ల ద్వారా ప్రతీ పంట సాగును,దానిలో యజమాన్య పద్ధతులు, తెగుళ్ల నివారణ, అధిక దిగుబడుల సాధన కోసం తీసుకోవాల్సిన చర్యల గురించి సవివరంగా వివరిస్తారు. వీడియో కాన్ఫరెన్స్ సెంటర్లకు స్థానిక వ్యవసాయశాఖ అధికారులు, రైతులు తప్పనిసరిగా హాజరయ్యేలా చూడటంతోపాటు వారికి తగిన సలహాలు, సూచనలు ఇస్తారు. గతంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాలోని ఆయా నియోజకవర్గాల్లోని రైతువేదికల్లో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్ కేంద్రాలు రైతులకు ప్రయోజనం చేకూర్చుతుండటంతో ప్రభుత్వం మండలాలకు వీడియో కాన్ఫరెన్స్ సెంటర్‌లను ఏర్పాటు చేయగా త్వరలో క్లస్టర్లకు కూడా ఈ విధానం అమల్లోకి రానుంది.

రైతులకు ఎంతగానో ప్రయోజనం



నల్లగొండ జిల్లాకు అదనంగా మరో 25 మండలాల్లోని రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నాం. దీనికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలమేరకు ఏర్పాటు చేయనున్నాం. రాష్ట్ర వ్యవసాయశాఖ కమిషనరేట్ నుంచి ఆయా మండలాలకు కేటాయిస్తూ ఉత్తర్వులు వచ్చాయి. వ్యవసాయంలో ఆధునిక పద్ధతుల ద్వారా అధిక దిగుబడుల సాధన, సాగులో మెళుకువలు, విధి, విధానాల గురించి వివరిస్తాం. శాస్త్రవేత్తల ద్వారా కూడా శిక్షణ ఇస్తాం.

- పి.శ్రవణ్ కుమార్, జేడీఏ, నల్లగొండ

జడ్పీ నిధుల్లో ఎమ్మెల్యేల జోక్యం తగదు

స్థాయీ సంఘం సమావేశంలో చైర్మన్ సందీప్‌రెడ్డి

భువనగిరి రూరల్, జూన్ 18: జిల్లా పరిషత్ సాధారణ నిధులతో చేపడుతున్న నిర్మాణ పనుల్లో ఎమ్మెల్యేలు జోక్యం చేసుకొని పనులను అడ్డుకోవడం సరికాదని జడ్పీచైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి అన్నారు. మంగళవారం జడ్పీకార్యాలయంలో 1వ, 7వ (ఆర్థిక, పనులు), 2వ (గ్రామీణాభివృద్ధి), 4వ (విద్యా వైద్యం) స్థాయీ సంఘం సమావేశాలు జడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి అధ్యక్షతన జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆలేరు మండల పరిధిలోని జడ్పీ నిధులతో మంజూరైన కల్వర్టు నిర్మాణాల ప్రహరీ పనులు ఇప్పటివరకు పూర్తి చేయకపోవడంతో పీఆర్ ఈఈ వెంకటేశ్వర్లును ప్రశ్నించారు. సమావేశానికి హాజరైన ఆలేరు పంచాయతీరాజ్ ఏఈ నవ్యను సమావేశంలో నిలదీయగా, పనులను పెండింగ్‌లో పెట్టాలని అధికార పార్టీ నేతలు ఆదేశించారని వివరణ ఇచ్చారు. అయితే సత్వరమే పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయాలని జడ్పీచైర్మన్ సూచించారు.

పనులు పూర్తి చేయాలి : నగేష్

పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని జడ్పీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ కుడుదుల నగేష్ అన్నారు. జిల్లా పరిషత్ నిధులకు సంబంధించి ఎమ్మెల్యేలకు సంబంధంలేదన్నారు. వానాకాలంలో సీజనల్ వ్యాధుల నివారణకు జాతీయ ఆరోగ్య మిషన్‌కు సంబంధించి నిధుల మంజూరు, పాఠశాలలు పునఃప్రారంభం దృష్ట్యా విద్యార్థులకు యూనిఫాం అందజేత, పాఠ్య, నోట్ పుస్తకాల పంపిణీపై డీఈవో నారాయణరెడ్డిని అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో డాక్టర్ల కొరత, పేదలకు అందుతున్న వైద్య సేవలపై డీసీహెచ్‌వో డాక్టర్ చిన్నానాయక్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం కేసీఆర్ కిట్ పథకం ఎందుకు అమలు కావడంలేదని, సభ్యులు ప్రశ్నించగా జనవరి నుంచి ఈ పథకం నిలిపివేసినట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ వై.పాపారావు తెలిపారు. సమావేశంలో జడ్పీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ డాక్టర్ కుడుదుల నగేష్, జడ్పీ సీఈవో ఎన్.శోభారాణి, డిప్యూటీ సీఈవో డి.విష్ణువర్ధన్‌రెడ్డి, కే.రమేష్‌రెడ్డి, జడ్పీటీసీలు పల్లా వెంకట్‌రెడ్డి, చామకూరగోపాల్, సుబ్బూరు బీరుమల్లయ్యవివిధ శాఖల జిల్లాఅధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీచైర్మన్ సందీప్‌రెడ్డి

కమ్యూనిస్టు పార్టీ ద్వారానే దళితులకు ధైర్యం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

యాదగిరిగుట్ట రూరల్, జూన్ 18: కమ్యూనిస్టు పార్టీ ద్వారానే దళితులను ధైర్యం వచ్చిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. యాదగిరిగుట్ట పట్టణంలో మూడు రోజుల పాటు జరగనున్న దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్రస్థాయి శిక్షణా శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్ల గడుస్తున్నా, దళితులపై నేటికీ వివక్ష కొనసాగుతోందని, ఆ వివక్ష పోవాలంటే లాల్ నీల్ ఒక్కటే మార్గమని, ఆ ధైర్యం ఇచ్చేది మార్క్సిజం, అంబేద్కర్ సిద్ధాంతాలు మాత్రమేనన్నారు. సమాజంలో సంపద సృష్టించే శ్రమైక జీవన విధానంలో మమేకమైన వారే దళితులన్నారు. రాజ్యాంగంలో అనేక హక్కులను డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పొందుపర్చారని, ఆ హక్కులన్నీ సాధించుకోవడానికి పోరాటం ఒక్కటే మార్గమని, ఆ పోరాటంలో మార్గంలో కమ్యూనిజం, అంబేద్కరిజం ఆచరించడం ద్వారా పోరాటంలో విజయం సాధిస్తామన్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వం దళితులకోసం ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టం తీసుకొచ్చిందన్నారు. బీఆర్ఎస్ హయాంలో సబ్‌ప్లాన్ నిధులు దారి మళ్లాయని, అలాకాకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలు, పౌరులపై ఉందన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు, డీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కే.ఏసురత్నం, మారపాక అనిల్‌కుమార్, తాళ్లపల్లి లక్ష్మణ్, సీపీఐ జిల్లా కార్యదర్శులు యానాల దామోదర్, బోలగాని సత్యనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, బండి జంగమ్మ, ఏశాల అశోక్, జిల్లా సమితి సభ్యుడు బబ్బూరి శ్రీధర్, ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షుడు కే.శ్రీనివాస్, ఎండీ ఇమ్రాన్, చెక్క వెంకటేష్, కొల్లూరి రాజయ్య, గోరేటి రాములు, మండల కార్యదర్శి కళ్లెపల్లి మహేందర్, వీరస్వామి, ఆరె.పుష్ప, బాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.



గుట్టలో మాట్లాడుతున్న కూనంనేని సాంబశివరావు

భువనగిరి ఖిల్లా అభివృద్ధికి కృషి

● శిక్షణ ఐఏఎస్‌ల హామీ

భువనగిరి టౌన్, జూన్ 18: భవిష్యత్‌లో జిల్లా కలెక్టర్‌గా పనిచేసే అవకాశం లభిస్తే ఖిల్లా అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని శిక్షణ ఐఏఎస్‌లు హామీ ఇచ్చారు. శిక్షణ ఐఏఎస్‌ల బృందం మంగళవారం భువనగిరి ఖిల్లాను సందర్శించింది. తెలంగాణకు కేటాయించిన 2023వ బ్యాచ్‌కు చెందిన ఆరుగురు అధికారులు క్షేత్రపర్యటనలో భాగంగా చారిత్రాత్మక భువనగిరి ఖిల్లాను సందర్శించారు. ఖిల్లా విశిష్టత, రాజులు, పాలన తీరు తదితర అంశాలను గైడ్ ఆవుల వినోద్‌కుమార్ వివరించారు. ఖిల్లాపైన ఉన్న కోట గోడ, రాజ భవనాలను ఆసక్తిగా పరిశీలించారు. పర్యాటక, పర్వతారోహణ, సాహస క్రీడల్లో ఖిల్లాకు బహుళ ప్రాచుర్యం ఉందన్నారు. ముందుగా జిల్లా అధికారులు ఐఏఎస్‌ల బృందానికి స్వాగతం పలికారు.

రూ.20లక్షల విలువైన హ్యాషిష్ ఆయిల్ స్వాధీనం

» నర్సీపట్నం నుంచి హైదరాబాద్‌కు తరలింపు

» బోరబండ ప్రాంతానికి చెందిన ముగ్గురి అరెస్టు

భువనగిరి రూరల్, జూన్ 18: గంజాయి పీల్చేందుకు అలవాటు పడిన ముగ్గురు మిత్రులు తక్కువకు కొనుగోలు చేసి ఎక్కువ ధరకు విక్రయించి సొమ్ము చేసుకోవాలని ప్రణాళిక రూపొందించారు. ఇందులో భాగంగా గంజాయి నుంచి తీసిన రెండు లీటర్ల ముడి పదార్థమైన హ్యాషిష్ ఆయిల్‌ను (గంజాయి) తీసుకువస్తూ పోలీసులకు చిక్కారు. భువనగిరి రూరల్ ఎస్ఐ తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. హైదరాబాద్‌లోని బోరబండకు చెందిన పెరుసముల దినేష్ (కారు మెకానిక్), అమర్తలూరి హానెస్ట్ (కార్పెంటర్) గంజాయి విక్రయిస్తుంటారు. బోరబండకు చెందిన ప్రైవేటు ఉద్యోగం చేసే మిత్రుడు తాళ్లపల్లి భరణితో కలిసి గంజాయి పీల్చేవారు. తేలికగా డబ్బు సంపాదించేందుకు ఏపీ రాష్ట్రం నుంచి తక్కువ ధరకు గంజాయి తెచ్చి స్థానికంగా యువతకు ఎక్కువ ధరకు విక్రయించేందుకు ముగ్గురూ ఆలోచన చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విశాఖ పట్నం జిల్లా నర్సీపట్నం వెళ్లి గంజాయి నుంచి తీసిన 2 లీటర్ల ముడి పదార్థమైన హషిష్ ఆయిల్(గంజాయి)ను తీసుకుని కారులో బయలుదేరారు. పోలీసులకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు భువనగిరి- చిట్యాల ప్రధాన రహదారి మధ్యలోని అనాజీపురం వద్ద ఎల్బీనగర్ ఎస్‌వోటీ, భువనగిరి రూరల్ పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో వారి నుంచి సుమారు రూ.20లక్షల విలువగల 2లీటర్ల హాషిష్ ఆయిల్‌ను, 3 సెల్ ఫోన్లు, ఒక కారు, రూ.2500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లోని నేరెడుమెట్టులో రాచకొండ పోలీస్ కమిషనర్ డాక్టర్ తరుణ్ జోషి ఈ సంఘటనా వివరాలను విలేఖరులకు వెల్లడించినట్లు ఎస్ఐ తెలిపారు.



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న రాచకొండ పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి

మరో వారం రోజుల్లో..

● పులిచింతల మరమ్మతులు పూర్తి

మేళ్లచెర్వు, జూన్ 18: సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలంలోని పులిచింతల ప్రాజెక్టులో 96.17 టీఎంసీల నీటి నిల్వ ఉండగా, 95అడుగుల నీటి మట్టం ఉంచేవరకు నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 175 అడుగులు (45.77 టీఎంసీలు) కాగా మంగళవారం సాయంత్రానికి 96.17 అడుగులుగా (0.49 టీఎంసీలు) నమోదైంది. ఎగువనుంచి వరద రాకపోగా, 1621 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు డెడ్ స్టోరేజీ 119.22అడుగులు (3.61 టీఎంసీలు) కాగా, ప్రాజెక్టు ప్రారంభించిన 2013 సంవత్సరం నుంచి పూర్తిస్థాయిలో మొదటిసారి ప్రాజెక్టు నీటిమట్టం డెడ్ స్టోరేజీ కంటే తగ్గింది. దీంతో ప్రాజెక్టు అడుగుబాగాన ఉన్న అండర్ గ్రౌండ్ గేట్ల మరమ్మతులకు ఆటంకం కలగకుండా ప్రాజెక్టు నీటిమట్టం 95 అడుగులు(29 మీటర్లు) చేరుకునే వరకు నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఇప్పటికే రేడియల్ క్రస్టు గేట్లు (24) పూర్తిస్థాయిలో మరమ్మత్తులు పూర్తికావటంతో ప్రాజెక్టు అడుగు బాగాన అండర్ గ్రౌండ్‌లో ఉన్న 8 గేట్లకు రబ్బర్ స్టీల్‌తో పాటు రోప్ వైర్లను పూర్తిగా మార్చటం జరుగుతుందని, ఈ ప్రక్రియ మరో వారం, పది రోజుల్లో పూర్తి అవుతుందని, దీంతో ప్రాజెక్టు పూర్తిస్థాయి మరమ్మతులు పూర్తి అవుతాయని ప్రాజెక్టు డీఈ అరుణ తెలిపారు.

జర్నలిస్టుల సంక్షేమానికి కృషి

● తెలంగాణ మీడియా అకాడమి చైర్మన్ కె. శ్రీనివాస్‌రెడ్డి

సూర్యాపేటరూరల్, జూన్ 18: తెలంగాణ జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తున్నామని మీడియా అకాడమి రాష్ట్ర చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఖమ్మంలో జరిగే టీయూడబ్ల్యూజే(ఐజేయూ)రాష్ట్ర మహాసభలకు వెళుతూ మార్గమధ్యలో సూర్యాపేటలో ఆగి విలేకరులతో మాట్లాడారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలైన ఇళ్లు, ఇళ్ల స్థలాలు, హెల్త్‌కార్డులు, అక్రిడిటేషన్ల విషయంలో కీలక నిర్ణయం తీసుకుంటామన్నారు. రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తమ సమస్యలు పరిష్కారమవుతాయని జర్నలిస్టులకు ఓ నమ్మకం, విశ్వాసం ఏర్పడిందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో 24వేల అక్రిడిటేషన్లు ఉన్నాయన్నారు. అర్హులైన ప్రతీ జర్నలిస్టుకు అక్రిడిటేషన్ వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే(ఐజేయూ) రాష్ట్ర అధ్యక్షుడు విరహత్‌అలీ, ఐజేయూ జాతీయ కార్యవర్గ సభ్యులు కొణిజేటి సత్యనారాయణ, రాష్ట్ర కార్యవర్గసభ్యులు చలసాని శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షుడు కోలా నాగేశ్వర్‌రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి బంటు కృష్ణ, బత్తుల మల్లికార్జున్, రెబ్బ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

జనసందోహం..'గిరి' ప్రదక్షిణం

● ప్రతిధ్వనించిన నారసింహ నామం

భువనగిరి అర్బన్, జూన్ 18: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహ స్వామివారి దేవస్థానంలో ఆనవాయితీగా వస్తున్న గిరిప్రదక్షిణ మంగళవారం అంచనాలకు మించి భక్తులు పాల్గొని ఏకశిఖరవాసుని పట్ల తమ భక్తిని చాటుకున్నారు. గిరిప్రదక్షిణతో మోక్షం ప్రాప్తిస్తుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. నమో నారసింహా అంటూ భక్తుల జయ జయ ధ్వానాల మధ్య దశ దిశలా ఆధ్యాత్మిక భావన పెంపొందించేందుకు దేవస్థానం ఆధ్వర్యంలో చేపట్టిన గిరి ప్రదక్షిణలో సుమారు 10వేల మంది భక్తులు పాల్గొన్నారు. పండుగలా సాగిన ప్రదక్షిణలో మార్గం మొత్తం జనసంద్రంగా మారింది. నడక దారిలో జనసందోహం నెలకొనగా కళాకారుల సంప్రదాయ నృత్యాలతో ప్రదక్షిణ వెంట కదిలారు. వేకువజాము నుంచి భక్తులు ఒక్కొక్కరుగా వైకుంఠ ద్వారం చేరుకోగా ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యతో పాటు ఈవో భాస్కర్‌రావు, అనువంశిక ధర్మకర్త నరసింహమూర్తి అక్కడ ప్రత్యేక పూజల అనంతరం వేదమంత్రాల నడుమ అర్చకస్వాములు హారతి ఇచ్చారు. ఆ తర్వాత యాదగిరిగుట్ట ఎంపీపీ చీర శ్రీశైలంతో కలిసి గిరిప్రదక్షిణకు బయలుదేరగా వీరి వెంట అశేష భక్తజనం విశేషంగా ముందుకు కదిలారు. యాదగిరిపై కొలువైన లక్ష్మీసమేతుడి జన్మనక్షత్రమైన స్వాతినక్షత్రం మంగళవారం రోజున సుమారు రెండు వేల మంది భక్తులతో వైకుంఠ ప్రాంతమంతా జనసంద్రంగా మారగా, గిరిప్రదక్షిణను విప్ బీర్ల ప్రారంభించారు. అరుణాచలం, సింహాచలం మాదిరిగా యాదగిరిగుట్టలో గిరిప్రదక్షిణ నిర్వహించడం విశేషంగా భక్తులు భావించారు. ఉదయం 5.30గంటలకు భక్తజనులతో వైకుంఠ ద్వారం నుంచి బయలుదేరి కొండచుట్టు సుమారు 2 కిలోమీటర్ల మేర 45నిమిషాల పాటు సాగగా తిరిగి వైకుంఠ ద్వారం చేరుకునే సరికి 5వేల మందికి చేరుకుంది. ఉదయం 11గంటల వరకు ఆ రద్దీ అలాగే కొనసాగిన ప్రదక్షిణలతో సుమారు మొత్తం 10వేల మంది భక్తులు పాల్గొని వైకుంఠ ద్వారం వద్ద మొక్కులు తీర్చుకున్నారు. భారీ సంఖ్యలో చేరుకున్న భక్తజన సందోహం మధ్య వైకుంఠ ద్వారం గుండా మెట్ల దారివెంట కొండపైకి ఉచిత దర్శనం కూలైన్ల ద్వారా తూర్పు రాజగోపురం నుంచి గర్భాలయంలోకి చేరుకుని స్వామిఅమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కీర్తి ప్రతిష్టలు విశ్వవ్యాప్తం అయ్యేలా మరిన్ని ఆధ్యాత్మిక కార్యక్రమాల ద్వారా విస్తృతం చేయాలని ప్రభుత్వ విప్ అయిలయ్య ఆకాంక్షించారు. అందుకోసం కొండపైన పాత ఆచారాలను పునరుద్ధరిస్తున్నట్లు, భక్తుల రాక పెంచేందుకు అవసరమైన చర్యలు చేపడతామన్నారు. ప్రతీ నెలా స్వాతినక్షత్రం రోజున దేవస్థానం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున గిరిప్రదక్షిణ కొనసాగనున్నట్లు ఆలయ ఈవో ఏ.భాస్కర్‌రావు తెలిపారు. యాదగిరిగుట్ట ఏసీపీ రమేష్‌కుమార్ నేతృత్వంలో పట్టణ ఇన్‌స్పెక్టర్ ఎం.రమేష్ పర్యవేక్షించగా ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, స్థానిక భక్తులు పాల్గొన్నారు.




గిరిప్రదక్షిణంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ అయిలయ్య, ఆలయ ఈవో భాస్కర్‌రావు, ప్రదక్షిణలో పాల్గొన్న జనవాహిని



ఉత్సాహంగా కోలాటం వేస్తున్న మహిళా భక్తులు

విషాదంగా మారిన ప్రేమ పెళ్లి



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు, చిరంజీవి(ఫైల్‌ఫొటో)

● భర్త వేధింపులు భరించలేక కుటుంబ సభ్యులతో కలిసి హత్య

పాలకవీడు, జూన్ 18: వారిద్దరూ ప్రేమించుకుని పెద్దలకు తెలియకుండా 15ఏళ్ల క్రితం ప్రేమవివాహం చేసుకోగా, ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారు. హైదరాబాద్‌లో ప్రైవేటు ఉద్యోగాలు చేశారు. భర్త అప్పులు చేయడంతో ఇద్దరి మధ్య విభేదాలు మొదలయ్యాయి. భర్త వేధింపులు తీవ్రతరం కావడంతో మూడునెలల క్రితం భార్య పుట్టింటికి వచ్చింది. మద్యం మత్తులో అత్తగారింటికి వచ్చిన భర్త ఆమెను చంపేస్తానని బెదిరించాడు. ఆమె కుటుంబసభ్యులు తాళ్లతో బంధించి రాళ్లు, కర్రలతో దాడి చేయటంతో మృతిచెందాడు. సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలం గుడుగుంట్లపాలెంలో సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఈ ఘటన జరిగింది. స్థానికులు, హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు తెలిపిన వివరాల ప్రకారం పాలకవీడు మండలం మూసీఒడ్డుసింగారం గ్రామానికి చెందిన ఆరుట్ల చిరంజీవి(41), ఈ గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలోని గుడుగుంట్లపాలెం గ్రామానికి చెందిన అరుణ కోదాడ కేఆర్ఆర్ కళాశాలలో డిగ్రీ చదివారు. ఒకే సామాజికవర్గానికి చెందిన వీరిద్దరూ ప్రేమించుకుని తల్లిదండ్రులకు తెలియకుండా వివాహం చేసుకుని హైదరాబాద్‌లో కాపురంపెట్టారు. పెళ్లి తర్వాత చిరంజీవి ఎంబీఏ చదవగా, అరుణ ఎమ్మెస్సీ(బాటనీ), బీఈడీ చదివింది. చిరంజీవి వివిధ ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగం చేయగా, అరుణ ప్రైవేట్ పాఠశాలలో పనిచేసింది.పెళ్లయిన ఐదేళ్ల తర్వాత కుటుంబసభ్యులకు చేరువై మూసీఒడ్డుసింగారంలోనే ఉంటున్నారు. అప్పటికి వీరికి కుమార్తె ఉంది. ఆ తర్వాత కుమారుడు జన్మించాడు. ఐదేళ్ల నుంచి చిరంజీవి ఏ ఉద్యో గం చేయడం లేదు. మద్యానికి బానిసయ్యాడు. కుటుంబ పోషణకు రూ.12 లక్షల వరకు అప్పుచేశాడు. ఈ అప్పును పుట్టింటి నుంచి తీర్చాలని భార్యపై ఒత్తిడి తెస్తున్నాడు. ఇద్దరి మధ్య వివాదాలు పెరగటంతో వీరి తగాదాను అప్పుడప్పుడు పెద్ద మనుషులు పరిష్కరించేవారు. తర్వాత యథావిధిగా తగాదాలు జరిగాయి.

మూడు నెలల క్రితం పిల్లలతో పుట్టినింటికి...

ఈ నేపథ్యంలో చిలుకూరు సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో కాంట్రాక్టు ఉపాధ్యాయురాలిగా అరుణ చేరింది. ఆ పాఠశాలకు చిరంజీవి వెళ్లి గొడవ పెట్టుకోవడంతో అరుణ అక్కడ ఉద్యోగం మానేసి మూడు నెలల క్రితం పిల్లలను తీసుకుని గుడుగుంట్లపాలెంలోని పుట్టినింటికి వెళ్లింది. రెండు రోజుల క్రితం నేరేడుచర్లలో ఓ ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా చేరింది. సోమవారం చిరంజీవి ఆ పాఠశాలకు వెళ్లి అక్కడి ఉపాధ్యాయులతో గొడవపడ్డాడు. గుడుగుంట్లపాలెంలో ఉంటున్న అరుణ ఇంటికి సోమవారం అర్ధరాత్రి 1.30 సమయంలో వెళ్లాడు. అరుణతో పాటు ఆమె కుటుంబ సభ్యులు గాఢ నిద్రలో ఉన్నారు. గమనించిన చిరంజీవి భార్య నిద్రిస్తున్న గది తలుపును బలవంతంగా తెరచి, ఆమె గొంతుపై కత్తి పెట్టాడు. అరుణకు మెలకువ వచ్చి అరిచేందుకు యత్నించగా.. చంపేస్తానని బెదిరించాడు. ఆమె పక్కనే ఉన్న పిల్లలు నిద్రలేచి వద్దు నాన్నా.. అంటూ అరవడంతో కుటుంబసభ్యులందరూ మేల్కొన్నారు. దగ్గరకు వస్తే చంపుతానని వారందరినీ చిరంజీవి బెదిరించాడు. ఆ అలికిడికి ఆ ఇంటి పక్కనే నివసిస్తున్న అరుణ బాబాయిలు, వారి బంధువులు వచ్చారు. అందరూ కలిసి చిరంజీవిని తాళ్లతో బంధించారు. భార్య అరుణతో పాటు రాళ్లు, కర్రలతో చిరంజీవిపై దాడి చేయడంతో రాత్రి 2.30గంటలకు అపస్మారక స్థితికి వెళ్లాడు. అరుణ కుటుంబ సభ్యులు 108అంబులెన్సుకు సమాచారం ఇవ్వగా వేకువజామున 3.30గంటలకు 108 సిబ్బంది వచ్చి పరిశీలించి చిరంజీవి మృతి చెందినట్లు నిర్ధారించి వెనుదిరిగి వెళ్లారు. సోమవారం ఉదయం ఆరు గంటలకు హుజూర్‌నగర్ సీఐ ఘటనా స్థలానికి వచ్చి మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం హుజూర్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చిరంజీవి సోదరుడు ఆరుట్ల నరేందర్ ఫిర్యాదు మేరకు దాడి చేసిన భార్యతో పాటు మరో తొమ్మిది మంది కుటుంబ సభ్యులపై పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నింగీ.. నేల కలిసేలా... మనసు మురిసేలా

● ట్రావెల్ ఫొటోగ్రఫీలో జాతీయస్థాయి సిల్వర్‌మెడల్ సాధించిన ప్రదీప్

మాడ్గులపల్లి, జూన్ 18:ఎత్తైన పర్వత శ్రేణులు.. పచ్చ దనం పరుచుకున్న కొండపై మంచు.. నింగీ నేల ఒకేచోట చూస్తే ఎవరికైనా మనసు పరవశిస్తుంది... హిమాచల్‌ప్రదేశ్‌లోని ఈ అద్భుత దృశ్యాన్ని తన కెమెరాలో బంధించిన నల్ల గొండ జిల్లా ఫొటోగ్రాఫర్‌కు జాతీయ స్థాయిలో పురస్కారం దక్కింది. ట్రావెల్ ఫొటోగ్రఫీ విభాగంలో నిర్వహించిన పోటీల్లో నల్లగొండ జిల్లా మాడ్గులపల్లికి చెందిన ఫొటోగ్రాఫర్ మారేపల్లి ప్రదీప్ జాతీయస్థాయి సిల్వర్ మెడల్ సాధించారు. ఈ నెల 6 నుంచి 11వ తేదీ వరకు హిమాచల్‌ప్రదేశ్‌లోని కులు,మనాలిలో సిగ్మా అకాడమీ ఆఫ్ ఫొటోగ్రఫీ ఆధ్వర్యంలో అడ్వాన్స్ ఫొటోగ్రఫీ, అడ్వెంచర్, పిక్టోరియల్, ట్రావెల్ ఫొటోగ్రఫీ వంటి అంశాల్లో పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు 40మంది ఫొటోగ్రాఫర్లు హాజరయ్యారు. ట్రావెల్ ఫొటోగ్రఫీ విభాగంలో ప్రదీప్ తీసిన హిమాచల్‌ప్రదేశ్‌లోని రోతంగ్‌పాస్ ప్రాంతానికి సంబంధించిన ఫొటోకు జాతీయస్థాయి సిల్వర్ మెడల్ లభించింది. ఈ నెల 12వ తేదీన మనాలిలో సిగ్మా ఫొటోగ్రఫీ అకాడమీ చైర్మన్ ఎంసీ శేఖర్ నుంచి ప్రదీప్ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ప్రదీప్ మాట్లాడుతూ ఫొటోగ్రాఫర్లలో ప్రతిభను వెలికితీయడానికి జాతీయస్థాయి వర్క్‌షాప్ నిర్వహించడం ద్వారా గ్రామీణ ఫొటోగ్రాఫర్లను ప్రోత్సహించినట్లు అవుతుందన్నారు.




మారేపల్లి ప్రదీప్ తీసిన హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రంలోని రోతంగ్‌పాస్ వద్ద ప్రాంతం ఫొటో, సిగ్మా ఫొటోగ్రఫీ అకాడమీ చైర్మన్ ఎంసీ శేఖర్ నుంచి అవార్డు అందుకుంటున్న ప్రదీప్

అతి వేగానికి ఇద్దరు బలి

● రోడ్డు దాటుతున్న బైక్‌ను ఢీకొట్టిన మరో వాహనం

● కుమార్తె మృతి, తండ్రికి గాయాలు

● బైక్‌తో ఢీకొట్టిన యువకుడు అక్కడికక్కడే మృతి

కనగల్, జూన్ 18 : అతి వేగం, నిర్లక్ష్యం ఇద్దరి ప్రాణాలను బలితీసుకుంది. ద్విచక్ర వాహనంపై రోడ్డు క్రాస్ చేస్తుండగా మరో వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో ఓ వాహనంపై వెళ్తున్న కుమార్తె మృతి చెందగా, తండ్రి గాయపడ్డాడు. వాహనంతో ఢీకొట్టిన యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. మంగళవారం నల్లగొండ జిల్లా కనగల్ మండలంలో ఈ సంఘటన జరిగింది. ఎస్ఐ రామకృష్ణగౌడ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నిడమనూరరు మండలం గోవిందన్నగూడెం గ్రామానికి చెందిన కొండ కృష్ణయ్య, ఆయన పెద్దకుమార్తె అరుంధతి(22)తో కలిసి నల్లగొండ పట్టణంలోని అయ్యప్పగుడికి దైవదర్శనం కోసం ఇంటి నుంచి మంగళవారం తెల్లవారుజాము 5.30 గంటల సమయంలో ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. మార్గమధ్యలో బాబాసాయిగూడెం గ్రామ స్టేజీ వద్ద నల్లగొండ-సాగర్ హైవే రోడ్డుపైకి వీరి వాహనం వస్తున్న క్రమంలో తిరుమలగిరి(సాగర్) మండలానికి చెందిన బత్తుల పవన్‌కుమార్(23) పల్సర్‌బైక్‌పై అతి వేగంగా నల్లగొండ వైపునకు వస్తూ వీరిని వెనకనుంచి ఢీకొట్టాడు. దీంతో కృష్ణయ్య, అరుంధతి రోడ్డుపై పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. అదేవిధంగా పవన్‌కుమార్ తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. గాయాలపాలైన తండ్రీ కుమార్తెలను స్థానికులు 108 వాహనంలో ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స కోసం తరలించారు. అప్పటికే అరుంధతి మృతి చెందిందని వైద్యులు ధ్రువీకరించారు. గాయపడిన కృష్ణయ్యకు చికిత్స అందిస్తున్నారు. ప్రమాద విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పవన్‌కుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అరుంధతి తల్లి లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు. మృతదేహాలకు పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించామన్నారు. అరుంధతి డిగ్రీ పూర్తి చేసి కంప్యూటర్ కోర్సులో శిక్షణ పొందుతుండగా, పవన్ తిరుమలగిరి(సాగర్)లోని ఓ హోటల్‌లో వంటమనిషిగా పనిచేస్తున్నాడు.



రోడ్డుపై కృష్ణయ్య, మృతుడు పవన్(ఫైల్‌ఫొటో)



తిరుమలగిరి(సాగర్)లో విషాదఛాయలు

తిరుమలగిరి(సాగర్): నాగార్జునసాగర్-నల్లగొండ హైవేపై జరిగిన రోడ్డు ప్రమాదంలో తిరుమలగిరి(సాగర్) మండలకేంద్రానికి చెందిన యువకుడు బత్తుల పవన్‌కుమార్(23) మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. పవన్‌కుమార్ సోమవారం సాయంత్రం చెర్వుగట్టు వద్ద ఉన్న రామలింగేశ్వరస్వామి దర్శనానికి నల్లగొండలో స్నేహితుడి బైక్‌పై వెళ్లి తిరుమలగిరి వచ్చాడు. అనంతరం మంగళవారం తెల్లవారుజామున స్నేహితుడి వాహనాన్ని తిరిగి ఇచ్చేందుకు నల్లగొండకు బయలుదేరి ప్రమాదానికి గురై మృతి చెందాడు. స్థానిక హోటల్‌లో పనిచేస్తూ అందరితో కలివిడిగా ఉండే పవన్ మృతితో అతడి బంధువులు, స్నేహితులు, స్థానికులు విచారం వ్యక్తం చేశారు.

ప్రశాంతంగా యూజీసీ నెట్ పరీక్ష

నల్లగొండ, జూన్ 18: యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) నెట్ ప్రవేశపరీక్ష మంగళవారం నల్లగొండ జిల్లాకేంద్రంలో ప్రశాంతంగా జరిగింది. స్థానిక ఆల్ఫా జూని యర్ కళాశాల, నలంద ఫార్మసీ కళాశాలలో నిర్వహించిన పరీక్షకు 1,119మంది విద్యార్థులకు 921మంది హాజరయ్యారు. ఉదయం 9.30గంటల నుంచి 12.30గంటల వరకు, మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు రెండు పర్యాయాలు నిర్వహించినట్లు ఎన్‌టీఏసీటీ కోఆర్డినేటర్ పార్థసారధి తెలిపారు.

సివిల్ సర్వీసెస్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

నల్లగొండటౌన్, జూన్ 18: షెడ్యూల్డ్ కులాల స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో 2024-25 సంవత్సరానికి హైదరాబాద్‌లో నిర్వహించే సివిల్స్ ప్రిలిమినరీ, మెయిన్స్(10 నెలల రెసిడెన్షియల్) ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్సీ స్టడీ సర్కిల్ జిల్లా డైరెక్టర్ నవీన్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 100మందిని రాత పరీక్షల ద్వారా ఎంపిక చేస్తారని, డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఈ నెల 16 నుంచి జులై 10వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అదేవిధంగా బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో కూడా గ్రూప్స్‌కు సిద్ధమయ్యే బీసీ అభ్యర్థులకు కూడా ఉచిత శిక్షణ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ కోఆర్డినేటర్ విజయ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

భూవివాదం కేసులో పోలీసులు వేధిస్తున్నారు

● పోలీస్‌స్టేషన్ ఆవరణలో రైతు ఆత్మహత్యాయత్నం

నిడమనూరు, జూన్ 18: భూవివాదం కేసులో పోలీసులు వేధిస్తున్నారని మనస్తాపానికి గురైన ఓ రైతు పోలీస్‌స్టేషన్ ఆవరణలో క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. మంగళవారం నల్లగొండ జిల్లా నిడమనూరు పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఈ సంఘటన జరిగింది. బాధితుడి కుటుంబసభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నిడమనూరు మండలం ఎర్రబెల్లికి చెందిన తుంగతుర్తి వెంకటాచారి(65) ఐదు ఎకరాల్లో వ్యవసాయం చేస్తున్నాడు. మాడ్గులపల్లి మండలం ధర్మాపురం శివారులో 1.16 గుంటల భూమి ఉండగా, 14 ఏళ్ల క్రితమే తమ బంధువులైన మాడ్గులపల్లి మండలం ధర్మాపురం గ్రామానికి చెందిన దేశోజు కనకాచారి సోదరులకు విక్రయించాడు. అప్పట్లో వారు రిజిస్ట్రేషన్ చేయించుకోకపోయినా, భూమి మాత్రం కనకాచారి సోదరుల కబ్జాలోనే ఉంది. భూమి విషయంలో వెంకటాచారికి, కనకాచారి సోదరుల మధ్య ఘర్షణలు జరుగుతున్నాయి. ఈ విషయమై పోలీస్‌స్టేషన్ చుట్టూ తిరిగారు. ఆ భూమికి ఇటీవల కనకాచారి సోదరులు ఏర్పాటుచేసిన ప్రహరీని వెంకటాచారి ధ్వంసంచేశాడు. దీంతో కనకాచారి సోదరులు ఈ నెల 13న ఫిర్యాదు చేయడంతో వెంకటాచారి, ఆయన కుమార్తె ధనలక్ష్మి, అల్లుడు యదగిరి,ట్రాక్టర్ డ్రైవరు శ్రీనివాస్‌పై నిడమనూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ నేపథ్యంలో నాలుగురోజులుగా స్టేషన్‌కు రప్పిస్తుండటంతో మనస్తాపానికి గురైన వెంకటాచారి మంగళవారం ఉదయం 11.30 గంటల సమయంలో పోలీస్‌స్టేషన్ ఆవరణలో క్రిమిసంహారక మందుతాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన పోలీసులు డబ్బాను లాక్కొని ఎదురుగా ఉన్న ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స చేయించి అక్కడి నుంచి మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ వెంటిలేటర్ సౌకర్యం లేకపోవటంతో చికిత్స నిమిత్తం నల్లగొండ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వెంకటాచారి పరిస్థితి నిలకడగా ఉందని పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై ఎస్ఐ గోపాల్‌రావును వివరణ కోరగా, కనకాచారి ఫిర్యాదు మేరకు వెంకటాచారితో పాటు మరో ముగ్గురిపై ఈ నెల 13వ తేదీన కేసు నమోదు చేశామన్నారు. తాము వేధించామన్న ఆరోపణలను ఎస్ఐ ఖండించారు. వెంకటాచారిని తాము స్టేషన్‌కు పిలవలేదని, ఆయన క్రిమిసంహారక మందు తాగి స్టేషన్ లోపలికి రాగానే గమనించి ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.



చికిత్స పొందుతున్న రైతు వెంకటాచారి



కాషాయ రంగును పులుముకుందా అన్నట్లుగా నల్లగొండ జిల్లా కేంద్రంలో మంగళవారం సాయంత్రం ఆకాశం కనిపించింది. సూర్యాస్తమయ వేళలో బంగారు, కాషాయ రంగుల్లో వెలుగులు స్థానిక రామాలయానికి మరింత శోభను తెచ్చిపెట్టాయి.

మురుగునీటి మడుగుతో దుర్గంధం



- అవసరంలేని చోట కాలువల నిర్మాణం
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కాలనీల ప్రజలు
- రోగాల బారిన పడుతున్నామని ప్రజల ఆవేదన

దుర్గంధం వెదజల్లుతున్న మురుగునీటి మడుగు(గుంత)తో రెండు కాలనీల ప్రజలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఎన్ని మార్లు అధికారులకు మొరపెట్టుకున్నా సమస్యను పరిష్కరించలేదు. ప్రజలకు అవసరమైన ప్రాంతంలో కాలువ నిర్మాణాన్ని వదిలి పెట్టి, అవసరం లేని చోట అధిక వ్యయంతో పెద్ద కాలువను నిర్మించారు. మురుగు నీటికి పై భాగం, కింది భాగంలో కాలువను నిర్మించారు. మురుగునీరు కాలువల ద్వారా బయటికి వెళ్లేలా మాత్రం చేయలేదు. ప్రజలకు దుర్గంధం బాధ మాత్రం తప్పడంలేదు.

- చౌటుప్పల్ టౌన్

చౌటుప్పల్ పట్టణంలోని 9, 10 వ వార్డులకు సంబంధించిన మురుగు నీరు వెళ్లేందుకు గాను రెండు కోట్లతో సుమారు రెండున్నర కి.మీటర్ల పొడవున నాలుగు మీటర్ల వెడల్పుతో నిర్మించేందుకు సంవత్సరం క్రితం ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. దీంతో 9 వ వార్డు లోని మురుగు నీరు వెళ్లేందుకు రెండు అడుగుల వెడల్పుతో సుమారు 600మీటర్ల పొడవు న కాలువను నిర్మించి, దిగువలోని (10వవార్డు) మురు గు నీటి మడుగు వద్ద వదిలి వేశారు. అక్కడ ఉన్న పెద్ద మురు గు మడుగుల వద్ద సుమారు 80 మీటర్ల పొడవున వదిలిపెట్టి నాలుగు అడుగుల వెడల్పుతో సుమారు 1650 మీటర్ల పొడవున పది మాసాల క్రితం కాలువను నిర్మించారు. సమస్య ఉన్నచోట కాలువను నిర్మించకుండా వ్యవసాయ భూముల్లో కాలువను నిర్మించారని స్థానికులు విమర్శిస్తున్నారు. ముందుగా 10 వ వార్డులోని మురుగు నీటి గుంతల వద్ద కాలువను నిర్మించాలని కౌన్సిలర్లు దండ హిమబిందు అరుణ్‌కుమార్, బొడిగె అరుణబాలకృష్ణ అధికారులతో పాటు కాంట్రాక్టర్‌పై ఎంత ఒత్తిడి తెచ్చినా పట్టించుకోలేదు. దీని పర్యవసానమే ఇప్పుడు కాలనీ వాసు లు మురుగు నీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోవలసిన పరిస్థితి ఏర్పడింది. కాంట్రాక్టర్ కు ప్రభుత్వం నుంచి వచ్చే బిల్లులు (డబ్బులు) నిలిచి పో వడంతోనే కాలువ నిర్మాణ పనులను నిలిపి వేసినట్టు పక్కా సమాచారం. ఇదే కాంట్రాక్టర్ 14వ వార్డులో కూడా మురు గు కాలువ పనులను అర్థాంతరంగా నిలిపివేశారని, తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని కాలనీవాసులు పేర్కొంటున్నారు. ఈ సమస్యను మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి దృష్టికి స్థానిక మహిళలు తీసుకువెళ్లారు. 10, 14వ వార్డుల్లోని మురుగు కాలువల నిర్మాణ పనులను రూ. 6.50 కోట్ల కు టెండర్ ద్వారా కాంట్రాక్ట్ తీసుకున్న వ్యక్తి ఆర్థిక సమస్యల్లో చిక్కుకుని పను లు చేయడం లేదని కౌన్సిలర్లు ఆరోపిస్తున్నారు.



ఇబ్బందులు పడుతున్న కాలనీ వాసులు

9, 10 వ వార్డుల నుంచి ప్రవహించిన మురుగునీరు ఒకేచోట నిలిచి మడుగును తలపిస్తోంది.ఈ మురుగునుంచి వస్తున్న దుర్గంధం, ఈగలు, దోమలతో ఐదారు సంవత్సరాలుగా కాలనీ వాసులు తరచూ అనారోగ్యాల బారిన పడుతున్నారు. మురుగు నీటి మడుగులోంచి అప్పుడప్పుడు పాములు ఇళ్లలోకి వస్తుండడంతో ప్రజలు తీవ్ర భయందోళనకు గురవుతున్నారు. మురుగు మడుగుల్లో తిరిగే జంతువులతో ప్రబలుతున్న దుర్గందాన్ని కాలనీ వాసులు భరించలేకపోతున్నారు.

కాలనీ వాసుల ఇబ్బందులను తొలగించాలి



మురుగు నీటి సమస్యతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్య ఐదారు సంవత్సరాలుగా కొనసాగుతోంది. మురుగు నీరు నిలిచే ప్రాంతం ఒక పెద్ద మడుగుగా మారింది. ఈప్రాంతంలో సుమారు వంద మీటర్ల పొడవున మురుగు నీటి మడుగుకు కింది బాగం ,పై బాగంలలో కాలువను నిర్మించారు. ప్రస్తుతం రెండు కోట్లను వెచ్చించి నిర్మించిన కాలువ నిరూపయోగంగా మారింది. అవసరం ఉన్న ప్రాంతంలో కాలువను నిర్మించని ఇంజనీరింగ్ అధికారులు అవసరం లేని చోట మాత్రం పెద్ద కాలువను నిర్మించి చేతులు దులుపుకున్నారు.

- దండ హిమబిందు, 9వ వార్డు కౌన్సిలర్, చౌటుప్పల్

పాములు ఇళ్లలోకి వస్తున్నాయి



మురుగు నీటి మడుగు నుంచి తరచూ పాములు ఇళ్లలోకి వస్తున్నాయి. దుర్గంధంతో ఇళ్లలో ఉండలేకపోతున్నాం. తరచూ అనారోగ్యాలకు గురవుతున్నాం. మురుగు నీరు నిలిచే ప్రాంతం మురుగు కాలువను నిర్మించక పోవడంతోనే ఈ సమస్య పరిష్కారం కాలేదు. అధికారులు స్పందించి మురుగు నీటి కుంట కాలువను నిర్మించాలి. లేని పక్షంలో మునిసిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తాం.

- ప్రవీణ్‌కుమార్,10వ వార్డు కాలనీవాసి,చౌటుప్పల్

త్వరలో కాలువను నిర్మిస్తాం

10వ వార్డులోని మురుగు నీటి మడుగు వద్ద సుమారు 70 నుంచి 80 మీటర్ల పొడవున కాలువను త్వరలోనే నిర్మాణం చేయించి సమస్య ను పరిష్కరిస్తాం. వేసవిలోనే ఈ కాలువను నిర్మించాలని కాంట్రాక్టర్ ప్రయత్నించి తాత్కాలికంగా వాయిదా వేసుకున్నారు. సాధ్యమైనంత తొందరగా ఈ కాలువను నిర్మించి, సమస్యను పరిష్కరిస్తాం.

- వెన్నెల కుమార్, మునిసిపల్ ఏఈ,చౌటుప్పల్

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

భువనగిరి అర్బన్, జూన్ 18: ఎస్సీ కులాల స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహించే సివిల్ ప్రిలిమినరీ, మెయిన్స్‌లో 2024-25విద్యా సంవత్సరానికి గాను (పది నెలల రెసిడెన్షియల్) ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ నవీన్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ అర్హత గల అభ్యర్థులు 100మందిని రాత పరీక్ష ద్వారా ఎంపిక చేయనున్నట్లు, జూన్ 17 నుంచి జులై 10 వరకు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవచ్చని, 2024 జులై 21న హైదరాబాద్‌లో ప్రవేశ పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని స్టడీ సర్కిల్ నందు ఈ సంవత్సరం ఉచిత శిక్షణ కోసం ఉమ్మడి నల్లగొండకు చెందిన అభ్యర్థులు, వారి తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ. 3లక్షల కన్న తక్కువ ఆదాయం కలిగి ఎస్సీ, ఎస్టీ, బీసీ (బీసీ-ఇ, పీడబ్ల్యూడీ) చెందిన ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని, ఎంపికైన అభ్యర్థులకు ఉచిత భోజన వసతితో పాటు 10 నెలల కోచింగ్ ఇవ్వనున్నట్లు ప్రకటించారు.

క్రీడా పోటీలకు మండల స్థాయి ఎంపికలు

భువనగిరి అర్బన్, జూన్ 18: రాష్ట్ర క్రీడా పాఠశాలల్లో పోటీలకు గాను మండల స్థాయిలో ఎంపికలు చేయనున్నట్లు యువజన, క్రీడల అధికారి కే.ధనుంజనేయులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21 నుంచి 25 వరకు ఆయా మండలాల విద్యాధికారులు నిర్ణయించిన తేదీన ఎంపికలు నిర్వహించనున్నట్లు, జిల్లా స్థాయిలో ఈ నెల 28న జిల్లా కేంద్రం భువనగిరిలోని గురుకుల పాఠశాలలో ఉదయం 8గంటలకు ఎంపిక ప్రక్రియ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఎంపికైన బాలబాలికలు ప్రస్తుతం చదువుతున్న పాఠశాలల నుంచి విద్యార్హత, జన్మదిన ధ్రువపత్రం, బోనఫైడ్ సర్టిఫికెట్, మూడో తరగతి ప్రొగ్రెస్ రిపోర్ట్, ఆధార్ కార్డు ఉండాలని, జిల్లా స్థాయిలో ఎంపికైన వారికి టీఏ, డీఏ చెల్లించనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాల కోసం యువజన, క్రీడల అధికారి 8309992451 నంబరును సంప్రదించాలని, నాలుగో తరగతిలో ప్రవేశాల కోసం 2015 సెప్టెంబరు 1 నుంచి 31 ఆగస్టు 2016 వరకు జన్మించి వారై ఉండాలని తెలిపారు.

తూముకు మరమ్మతులు చేపట్టాలి

గుండాల, జూన్ 18: మండలంలోని నూనెగూడెం పెద్ద చెరువు తూముకు మరమ్మతులు చేపట్టాలని మంగళవారం తహసీల్దార్ జలకుమారికి ఆయన కట్టు రైతులు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయకట్టు రైతులు మాట్లాడుతూ ఏడాదిగా తూము నుంచి నీరు విడుదల కాకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ఈ విషయమై నీటి పారదల శాఖ అధికారులకు గతంలో అధికారులకు ఎన్ని సార్లు మొరపెట్టుకున్నప్పటికీ ఫలితం లేకుండాపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తూముకు మరమ్మతులు చేయించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి మద్దెపురం రాజు, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షులు మల్లారెడ్డి, మాజీ సర్పంచ్ రమేశ్, మాజీ ఉప సర్పంచ్ గన్నం మాధవరెడ్డి, ఆయకట్టు రైతులు ఇటుకలయ్య, మలిపెద్ది రాంరెడ్డి, అండెం రాఘవారెడ్డి, రాములు, బండి ఎల్లయ్య, అనిల్‌రెడ్డి, సోమిరెడ్డి పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్థులు

అనాథ పిల్లలకు ఆర్థిక సాయం

సంస్థాన్ నారాయణపురం, జూన్ 18: సంస్థాన్ నారాయణపురం మండలం ఐదుదొనలతండాకు చెందిన ముగ్గురు అనాథ పిల్లలకు దాతలు 7500 ఆర్థిక సాయాన్ని అందజేశారు. హైదరాబాదుకు చెందిన రమణ 5000, గుడిమల్కాపూర్ గ్రామానికి చెందిన మన్నె రవీందర్‌రెడ్డి 2500 ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈసహాయాన్ని తహసీల్దార్ కృష్ణ ద్వారా మంగళవారం అనాథ పిల్లలకు అందించారు. అనాథలకు ప్రతి ఒక్కరు తమ వంతు చేయూతనివ్వాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మన్నే నరసింహరెడ్డి, జక్కిడి చంద్రారెడ్డి, మన్నె రవీందర్ రెడ్డి, మన్నే సులోచనరెడ్డి, మన్నె ప్రమోద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘ధరణి’ సమస్యలను పరిష్కరించాలి

● **కలెక్టర్ హనుమంతు కే.జెండగే**

గుండాల, జూన్18: ధరణి సమస్యలను పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ హనుమంతు కే.జెండగే ఆదేశించారు. మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లను పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. రిజిస్ట్రేషన్లకోసం కార్యాలయానికి వచ్చేవారు అసౌకర్యాలకు గురి కాకుండా ఎప్పటికప్పుడు రిజిస్ట్రేషన్లు పూర్తి చేసి పంపించాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ జలకుమారి, ఆర్ఐ వెంకటేశ్వర్లు ఉన్నారు.



గుండాల: రిజిస్ట్రేషన్ రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ హనుమంతు కే.జెండగే

భూముల మార్కెట్ విలువపై నివేదికను అందజేయాలి: ఆర్డీవో



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో శేఖర్‌రెడ్డి

చౌటుప్పల్ టౌన్ : అన్ని రకాల భూముల మార్కెట్ విలువలను ఈ నెల 23వ తేదీ లోపుగా పరిశీలించి సమగ్ర నివేదికను అందజేయాలని చౌటుప్పల్ ఆర్డీవో శేఖర్‌రెడ్డి ఆదేశించారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో డివిజన్ పరిధిలోని చౌటుప్పల్, సంస్థాన్ నారాయణపురం, వలిగొండ, భూదాన్‌పోచంపల్లి, రామన్నపేట మండలాలకు చెందిన తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్లతో ఆర్డీవో శేఖర్‌రెడ్డి మంగళవారం భూముల మార్కెట్ విలువను నిర్ధారించేందుకు తగు సూచనలకు సంబంధించి ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ, గ్రామాలు, కాలనీల్లో భూముల బహిరంగ మార్కెట్ విలువను నిర్ధారించే బాధ్యతను ఎంపీడీవోలకు, జాతీయ, రాష్ట్ర రహదారుల వెంట ఉన్న భూముల మార్కెట్ విలువను నిర్ధారించేందుకు తహసీల్దార్లు, మునిసిపాలిటీల్లో కమిషనర్లకు బాధ్యతలను అప్పగిస్తున్నట్లు ఆర్డీవో తెలిపారు.

ప్రభుత్వం దృష్టికి త్రిపుల్‌ఆర్ రైతుల సమస్యలు

వలిగొండ : త్రిపుల్‌ఆర్ రైతుల సమస్యలను ప్రభుత్వం, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని చౌటుప్పల్ ఆర్డీవో శేఖర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో ప్రొద్దుటూరు గ్రామ పరిధి రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ రీజనల్ రింగ్ రోడ్డు నిర్మాణానికి రైతులు సహకరించాలన్నారు. ప్రభుత్వం భూమి విలువకు మూడు రెట్లు చెల్లిస్తుందన్నారు. ఒకవేళ రైతులకు ఏమైనా అభ్యంతరాలుంటే అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, డీఐ వెంకటేశ్వర్లు, సీనియర్ అసిస్టెంట్ శర్మ, ఎమ్ఆర్ఐ కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

నులి పురుగుల నిర్మూలనను విజయవంతం చేయాలి

రామన్నపేట, జూన్ 18: జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమన్ని గ్రామపంచాయతీ, విద్యా సంస్థలు, అంగన్‌వాడీ కేంద్రాల సహకారంతో నిర్వహించి విజయవంతం చేయాలని ఎంపీపీ పూస బాలమణి బాలనర్సయ్య అన్నారు. ఈ నెల 20న జాతీయ నులి పురుగుల నిర్మూలన వినోత్సవం సందర్భంగా ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల టాస్క్‌ఫోర్స్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ 19సంవత్సరాలోపు పిల్లలు అల్బెండాజోల్ మాత్రలు వెయించుకోవాలని తెలిపారు. సమావేశంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అశ్వినికుమార్, వైస్‌ఎంపీపీ నాగటి ఉపేందర్, ఎంపీడీవో యాకూబ్ నాయక్, తహసీల్దార్ లాల్ బహదూర్ ఉన్నారు.

మానసిక వికాసానికి ఆధ్యాత్మికత దోహదం

చౌటుప్పల్ టౌన్, జూన్ 18: మనో ధైర్యం, మానసిక వికాసానికి ఆధ్యాత్మికత దోహదం చేస్తుందని చౌటుప్పల్ మునిసిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు అన్నారు. స్థానిక అయ్యప్ప స్వామి ఆలయంలో రెండు రోజుల పాటు నిర్వహించే 9వ వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. సుప్రభాత సేవ, గోపూజ, గణపతి పూజ, స్వస్తి వాచనం, అఖండ దీపారాధన, ధ్వజా రోహణ, మూలమూర్తులకు పంచామృత అభిషేకాలు, హోమం నిర్వహించారు. శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ రాజు మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు ఆధ్యాత్మిక భావనను పెంపొందించుకోవాలని, సర్వమత సమానత్వాన్ని పాటించాలని ఆయన అన్నారు. అయ్యప్ప భక్తుల పూజలతో సమాజంలో క్రమశిక్షణ అలవడిందని, భక్తి భావం పెరిగిందని ఆయన తెలిపారు. ఆధ్యాత్మికతతోనే సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం పరిడవిల్లుతుందని, ధర్మమార్గంలో పయనించేందుకు శక్తి లభిస్తుందని ఆయన అన్నారు. కార్యక్రమాలలో దేవాలయ వ్యవస్థాపక అధ్యక్షుడు బి.మురళి, నిర్వహణ కమిటీ అధ్యక్షుడు కామిశెట్టి భాస్కర్, గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ మండల అధ్యక్షురాలు వెన్‌రెడ్డి సంధ్యారాణి, మునిసిపల్ వైస్ చైర్మన్ బత్తుల శ్రీశైలం, కౌన్సిలర్లు పి.శ్రీధర్‌బాబు, కామిశెట్టి శైలజా, బొడిగే అరుణా బాలకృష్ణ, తాడూరి శిరీషాపరమేష్, రైస్ మిల్లర్స్ జిల్లా ఉపాధ్యక్షుడు మంచికంటి భాస్కర్ గుప్త, ఆంజనేయ స్వామి దేవాలయ కమిటీ ప్రధాన కార్యదర్శి ఊడుగు రమేష్ పాల్గొన్నారు.



పూజలో పాల్గొన్న వెన్‌రెడ్డి రాజు దంపతులు

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి: ఐజేయూ



అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

భువనగిరి అర్బన్, జూన్ 18: దీర్ఘకాలికంగా పెండింగ్‌లోని జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని టీయూడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా ప్రధాన కార్యదర్శి పోతంశెట్టి కరుణాకర్ అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం పలువురు జర్నలిస్టులతో కలిసి రెవిన్యూ అదనపు కలెక్టర్ పి.బెన్‌షాలోమ్‌కు వినతి పత్రం అందజేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ జర్నలిస్టులకు సంబంధించినవి కొన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవాల్సిన సమస్యలు ఉండగా, మరికొన్ని కలెక్టర్ పరిధిలో పరిష్కరించదగిన వాటిని త్వరితగతిన పరిష్కరించాలని అదనపు కలెక్టర్‌కు విన్నవించారు. ముఖ్యంగా అసెంబ్లీ ఎన్నికల ముందు పలు మండలాల్లో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించగా మరికొన్ని మండలాల్లో నేటికీ అమలు కాలేదన్నారు. ఇళ్లు లేనివారికి ఇళ్ల స్థలాలు కేటాయింపు జరిపి ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా జర్నలిస్టులకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అన్ని కార్పొరేట్ ఆసుపత్రుల్లో హెల్త్ కార్డులు చెల్లుబాటు అయ్యేలా చర్యలు చేపట్టడమే కాక బీబీనగర్ ఎయిమ్స్‌లో జర్నలిస్టు కుటుంబాలకు ప్రత్యేకంగా వెల్‌నెస్ కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో పిల్లలకు ఎలాంటి ఫీజు లేకుండా రాయితీ ఇప్పించాలన్నారు. జిల్లాలోని గూడూరు, పంతంగి టోల్‌ప్లాజా వద్ద జర్నలిస్టులకు అందజేసిన అక్రెడిటేషన్ కార్డుదారులకు టోల్ మినహాయింపు ఇచ్చి ఉచిత ప్రయాణాలకు అనుమతించాలన్నారు. త్వరలో నూతనంగా మంజూరు చేయనున్న అక్రెడిటేషన్ కార్డులు వర్కింగ్ జర్నలిస్టులందరికి అందజేయడమే కాక రాష్ట్ర వ్యాప్తంగా బస్సుపాసు చెల్లుబాటు అయ్యేలా ఉచిత ప్రయాణాలకు అనుమతించాలన్నారు. జర్నలిస్టులపై దాడుల నియంత్రణ చట్టాన్ని కఠినంగా అమలు చేయడంతో పాటు విధి నిర్వాహణలోని జర్నలిస్టులపై దాడులకు పాల్పడినవారిపై కఠిన చర్యలు చేపట్టాలని కోరారు. వినతి అందజేసిన వారిలో ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు భువనగిరి మల్లేష్, రాష్ట్ర కమిటీ సభ్యులు వెలిమినేటి జహంగీర్, కూరెళ్ల మల్లేశచారి, నాయకులు ఎండీ.ఖుర్షీద్‌పాషా, బండారి జగదీష్, గడసందుల నాగరాజు, పాముల పర్తి లక్ష్మీనారాయణ, జోగు సతీష్, కనక బాలక్రిష్ణ, మెట్రో రమేష్, భువనగిరి శ్రీశైలం, స్వామి, శ్రీనివాసచారి పాల్గొన్నారు.

‘కోదాడ ఎమ్మెల్యే క్షమాపణలు చెప్పాలి’

భువనగిరి టౌన్, జూన్ 18: హిందువుల మనోభావాలను కించపరిచేలా గోవు బొమ్మ ముద్రించిన బక్రీద్ శుభాకాంక్షల పోస్టర్‌ను సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి వెంటనే క్షమాపణలు చెప్పాలని బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తరుణ్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు పట్నం కపిల్ అన్నారు. మంగళవారం భువనగిరిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఇదే తరహా పోస్ట్ చేసి జరిగిన తప్పిదాన్ని గ్రహించి క్షమాపణలు చెప్పిన భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డిని కోదాడ ఎమ్మెల్యే ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఆమె స్పందించకుంటే బీజేవైఎం పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తుందన్నారు. సమావేశంలో పట్టణ అధ్యక్షుడు కనుకుంట్ల రమేష్, జిల్లా అధికార ప్రతినిధి మంగు నర్సింహారావు, పుల్ల శివశంకర్, నెమిల నందు, నాగు నరేష్, రావుల సంతోష్, ప్రవీణ్ పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లో వంద శాతం కాన్పులు నిర్వహించాలి

మోత్కూరు, జూన్ 18: పీహెచ్‌సీల్లో 100శాతం గర్భిణుల నమోదు చేసి, ఆస్పత్రిలోనే కాన్పులు నిర్వహించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ యశోద కోరారు. మంగళవారం మోత్కూరు పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలించారు. సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. డాక్టర్లు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. విధుల పట్ల అలసత్వం చూపవద్దని హెచ్చరించారు.

● మోత్కూరు మండలంలో ఈ నెల 20న నిర్వహించనున్న జాతీయ నులి పురుగుల నివారణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పీహెచ్‌సీ వైద్యాధికారి హేమంత్‌కుమార్, ఎంపీడీవో పి.మనోహర్‌రెడ్డి కోరారు. మంగళవారం మోత్కూరు పీహెచ్‌సీలో సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. వర్షాకాలం ప్రారంభమైనందున ఇంటిని, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇంటి ముందు, వెనక చెత్త చెదారం లేకుండా, వాడి పడేసిన టైర్లు, కొబ్బరిబొండాం, పగిలిన పాత్రలలో నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. సమావేశంలో డాక్టర్ అమరావతి, సిబ్బంది పాల్గొన్నారు.

మొగిలిపాక అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే

వలిగొండ, జూన్ 18: మొగిలిపాక అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి హామీ ఇచ్చారు. మంగళవారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యేను కలిసి గ్రామస్థులు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా మొగిలిపాక నుండి జంగ్గారెడ్డిపల్లి వరకు రోడ్డు వెల్వర్తి చెరువు నుంచి వాటర్ పంపింగ్ కొత్త మోటర్ పంపు ఏర్పాటు వంటి అంశాలు గ్రామస్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో నాయకులు మామిడి సత్తిరెడ్డి, రాఘుపతిరెడ్డి, ఎల్లయ్య, యాదగిరి, అంజిరెడ్డి, అశోక్‌రెడ్డి, నర్సింహారెడ్డి పాల్గొన్నారు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఆలేరు రూరల్, జూన్ 18: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన సోమవారం అర్ధరాత్రి మండలంలోని శారాజీపేటలో జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుండాల మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన మేడ అయిలయ్య ఆయన భార్య మేడ కవితతో పాటు అదే గ్రామానికి చెందిన గవ్వల అయిలయ్య సోమవారం ఉదయం హైదరాబాద్‌కు వెళ్లి రాత్రి 10గంటల సమయంలో తిరిగి స్వగ్రామానికి బయలు దేరారు. కారు ఆలేరు మండలంలోని శారాజీపేట గ్రామం దాటుతున్న క్రమంలో దుర్గమ్మ గుడి సమీపంలో అదుపు తప్పి పడిపోవడంతో గవ్వల అయిలయ్య అక్కడికక్కడే మృతి చెందగా, మేడ అయిలయ్య, మేడ కవితకు గాయాలయ్యాయి. వారిని ప్రాథమిక చికిత్స కోసం ఆలేరులోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు తరలించారు. అయిలయ్య మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రికి తరలించారు. మంగళవారం పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం అయిలయ్య మృతదేహాన్ని బ్రాహ్మణపల్లికి తీసుకువెళ్లి దహన సంస్కారాలు నిర్వహించారు. అయిలయ్యకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఈ విషయమై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆలేరు పోలీసులు తెలిపారు. మేడ కవిత, మేడ అయిలయ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

భార్యాభర్తలకు గాయాలు

మోత్కూరు, జూన్ 18: మోత్కూరు మునిసిపాలిటీ కేంద్రంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బైక్‌పై వెళుతున్న భార్యాభర్తలు తీవ్రంగా గాయపడ్డారు. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం... ముత్తినేని వెంకటేష్, కమలమ్మ బైక్‌పై బ్యాంకుకు వెళ్లి మోత్కూరు వైపు వస్తుండగా, హైదరాబాదుకు చెందిన ఇద్దరు యువకులు బైక్‌పై మోత్కూరు నుంచి రాయగిరి వైపు వెళుతున్న క్రమంలో రెండు బైక్‌లు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. కమలమ్మ తలకు, కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. భర్త వెంకటేష్ కూడా గాయపడ్డాడు. చికిత్స కోసం 108లో వారిద్దిరిని భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించగా, అక్కడి నుంచి హైద్రాబాదు తరలించినట్టు చెబుతున్నారు.

పాము కాటుకు యువకుడు..

మోటకొండూర్, జూన్ 18: మరో రెండు రోజుల్లో పుట్టినరోజు ఉండగా అంతలోనే పాము కాటు వేయడంతో ఆ యువకుడు మృతి చెందాడు. మండలంలోని ఇక్కుర్తి గ్రామంలో సోమవారం రాత్రి యువకుడిని పాము కాటువేసింది. గ్రామస్థులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బడికె ఉదయ్‌కుమార్ (18) తండ్రితో కలిసి తమ వ్యవసాయ క్షేత్రంలో పాలు పితకడానికి వెళ్లగా, పాము కరిచింది. గమనించిన ఉదయ్ తండ్రికి తెలపడంతో ఆలేరులోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లాడు. సిబ్బంది పట్టించుకోకపోవడంతో జనగామలోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఉదయ్‌కుమార్‌కు తండ్రి ఉపేందర్, తల్లి పారిజాత, చెల్లి, తమ్ముడు ఉన్నారు. ఉదయ్‌కుమార్ హైదరాబాద్‌లోని ప్రయివేట్ హాస్టల్లో ఉంటూ డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు.

గౌతమ్ మోడల్ స్కూల్ పుస్తకాల గది సీజ్

భువనగిరి టౌన్, జూన్ 18: భువనగిరి పట్టణంలోని గౌతమ్ మోడల్ స్కూల్‌లో నిబంధనలకు విరుద్ధంగా పాఠ్యపుస్తకాలు విక్రయిస్తున్నారంటూ ఎస్ఎస్‌యూఐ చేసిన ఫిర్యాదు మేరకు పాఠశాలలోని పుస్తకాలు భద్రపరిచిన గదిని ఎంఈఓ నాగవర్ధన్‌రెడ్డి మంగళవారం సీజ్ చేశారు. అధిక ధరలతో, బలవంతంగా విక్రయిస్తూ తల్లిదండ్రులను ఆర్థికంగా దోచుకుంటున్నారని ఎంఈవోకు ఎన్ఎస్‌యూఐ నాయకులు వివరించారు. ఈ మేరకు ఎంఈవో స్పందిస్తూ పాఠశాల ఆవరణలో పాఠ్యపుస్తకాలను అక్రమంగా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని యాజమాన్యాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మంగ ప్రవీణ్, సురుపంగ చందు, శరత్, కార్తీక్, అసద్, తేజ పాల్గొన్నారు.

జిల్లాలో మోస్తరు వర్షం


యాదాద్రి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మంగళవారం కురిసిన వర్షాలకు సగటున 13.0మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లాలోని తుర్కపల్లిలో 29.0మిల్లీమీటర్లు, రాజాపేటలో 2.6, ఆలేరులో 18.1, మోటకొండూరులో 31.2మిల్లీమీటర్లు, యాదగిరిగుట్టలో 24.2మిల్లీమీటర్లు, భువనగిరిలో 25.5మిల్లీమీటర్లు, బొమ్మలరామారంలో 12.1, బీబీనగర్‌లో 13.1, పోచంపల్లిలో 40.2, చౌటుప్పల్‌లో 4.0, రామన్నపేటలో 2.2, వలిగొండలో 8.5, ఆత్మకూరులో 1.9, మోత్కురులో 0.2, గుండాలలో 7.7మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

బీసీల రిజర్వేషన్ శాతాన్ని నిర్ణయించాలి

భువనగిరి టౌన్, జూన్ 18: వాయిదా పడుతున్న కుల జన గణనను వెంటనే పూర్తిచేసి, జనాభా దామాషా ప్రకారం బీసీల రిజర్వేషన్ శాతాన్ని నిర్ణయించాలని బీసీ ప్రజాసంఘాలు డిమాండ్ చేశాయి. మంగళవారం భువనగిరిలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో బీఎల్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.పర్వతాలు, పీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నూనె వెంకటస్వామి మాట్లాడుతూ బీసీల రిజర్వేషన్ శాతాన్ని తేల్చాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని అన్నారు. బీసీలపై ఏ రాజకీయ పార్టీకి, నాయకులకు చిత్తశుద్ధి లేదన్నారు. సమావేశంలో బీసీ సంఘాల నాయకులు మోడీ రాందేవ్ యాదవ్, ఎర్ర జాన్సన్, పూస శ్రీనివాస్, కొడాలి వెంకటేష్, వడ్డెర కృష్ణయ్య, మరిపల్లి శ్రీనివాస్, భూక్య సంతోష్ నాయక్ పాల్గొన్నారు.

బస్టాండ్ ఆవరణలో అన్నదానం

మోటకొండూర్, జూన్ 18: టీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ పుట్టిన రోజు వేడుకల సందర్భంగా మంగళవారం వితరణ కార్యక్రమాలు కొనసాగాయి. బస్టాండ్ ఆవరణలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రాహం వద్ద టీ ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కొల్లూరి వెంకటేష్ అధ్యర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం బస్టాండ్ ఆవరణలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టీ ఎమ్మార్పీఎస్ మండల నాయకులు కొల్లూరి మొగులయ్య, బొట్ల మంగపతి, భాస్కరుని రఘునాథ్‌రాజు, వంగపల్లి జహంగీర్, బొట్ల కృష్ణ, నవీన్, రమేష్, వీరనర్సయ్య, కొల్లూరి ప్రవీన్, రాజు, నర్సింహ పాల్గొన్నారు.



కేక్ కట్‌చేస్తున్న టీఎమ్మార్పీఎస్ నాయకులు